సాక్షి
గుంటూరు
సోమవారం । 2 । డిసెంబర్ । 2024



కార్తిక పూజలు

మంగళగిరి : పట్టణంలోని లక్ష్మీనృసింహ స్వామి, గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తిక దీపాలు వెలిగించారు.



పట్టువస్త్రాలు సమర్పణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మకు ఆదివారం తంగెడ నరసింహారావు దంపతులు పూజలు చేసి పసుపు, కుంకుమ సహా పట్టు వస్త్రాలు సమర్పించారు.

మల్లికార్జునస్వామికి అన్నాభిషేకం



గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని మల్లికార్జునపేటలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి దేవస్థానంలో ఆదివారం అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష అభిషేకాలు, పూజలు ఘనంగా జరిగాయి.

న్యూస్‌రీల్

రిషితేశ్వరికి న్యాయం చేయాలని డిమాండ్



లక్ష్మీపురం: విద్యార్థిని రిషితేశ్వరికి న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ కార్యదర్శి లక్ష్మణరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ డిమాండ్ చేశారు. రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేయటం చాలా బాధాకరమని తెలిపారు. ర్యాగింగ్ తట్టుకోలేక చనిపోయిన విద్యార్థినికి న్యాయం చేయకుండా ఇలాంటి తీర్పు న్యాయస్థానం ఇవ్వటం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఈ కేసులో నిందితులను శిక్షించాలని ప్రభుత్వం అప్పీలు చేయాలని డిమాండ్ చేశారు. శంకర్ విలాస్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 2015లో ఆర్కిటెక్చర్ చదువుతున్న రిషితేశ్వరి ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందని గుర్తుచేశారు. చనిపోయే ముందు సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు కారణం ర్యాగింగ్ అని, సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారని వివరంగా రాసినట్లు తెలిపారు. తొమ్మిది సంవత్సరాలుగా కేసు విచారణ కోర్టులో నడుస్తోందని, ఇప్పుడు కేసు కొట్టి వేయడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా ప్రభుత్వం అప్పీల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలియజేసిన వారిలో అనూరాధ, స్వాతి, బాషా, ఐద్వా నాయకురాలు రమణ, పద్మ ఉన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, నగర అధ్యక్షుడు యశ్వంత్, నగర సభ్యులు నరేంద్ర, సుభాని, షంషీర్, శివాజీ, సందీప్, బాబు, రిహాన్, భాను, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 2210 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 244 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 44 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 57 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 188 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1179 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యా విజేతలుగా పల్నాడు జట్లు



నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి సీనియర్ ఆట్యాపాట్యా చాంపియన్‌షిప్ పోటీలలో మహిళలు, పురుషుల విభాగంలో పల్నాడు జిల్లా జట్లు ప్రథమ స్థానాన్ని సాధించినట్టు ఆట్యాపాట్యా జిల్లా కార్యదర్శి వున్నం రోహిత్ జోయెల్ ఆదివారం తెలిపారు. భీమవరంలోని డీఎన్‌ఆర్ కళాశాల ఆధ్వర్యంలో 11వ రాష్ట్ర స్థాయి సీనియర్ ఆట్యాపాట్యా పోటీలు గత నెల 30, ఈనెల 1వ తేదీలలో నిర్వహించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లా జట్లు ఫైనల్ పోటీలలో పశ్చిమగోదావరి జిల్లా జట్ల మీద విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్టు వివరించారు.

ఈతకు వెళ్లి చెరువులో విద్యార్థి గల్లంతు



చినగంజాం: చెరువులో ఈతకు వెళ్లి ఓ విద్యార్థి గల్లంతైన ఘటన ఆదివారం మండలంలోని పర్చూరు మండలం వీరన్నపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వీరన్నపాలెం గ్రామానికి చెందిన పాలేరు శ్రీనివాసరావు రెండో కుమారుడు జస్వంత్ (17) చీరాల భారతి డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో గ్రామంలోని పడమటి దిక్కున్న చెరువులో సరదాగా ఈత కొట్టేందుకు సాయంత్రం 5.30 గంటల సమయంలో వెళ్లాడు.ఆ తర్వాత కుమారుడు కన్పించకుండా పోవడంతో తండ్రి శ్రీనివాసరావు చెరువులో వెతికించాడు. సుమారు 10 మంది గజఈతగాళ్లు చెరువులో వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, చీరాల నుంచి ఫైర్ సిబ్బందిని పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయేంత వరకు చెరువులో ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది వెదికినా జస్వంత్ ఆచూకీ తెలియరాలేదు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవతున్నారు.

గుం'టూరు'లో గంజాయ్!

- భైకులపై ఉత్తరాంధ్రకు వెళ్తూ పెద్దఎత్తున కొనుగోలు
- తక్కువ సమయంలో ఎక్కువ సంపాదనకు నగరంలో సరఫరా
- హాస్టళ్లకూ విస్తరించిన ముఠాల కార్యకలాపాలు
- గుంటూరులో పెరిగిన గంజాయి సిగరెట్ల విక్రయాలు
- కఠిన చర్యల దిశగా పోలీసుల ప్రయత్నాలు శూన్యం

విద్యార్థులు, యువకులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు

చక్కగా చదువుకోవాలి.. బంగారు భవిష్యత్తు కోసం ప్రయత్నించాలి.. ఇదీ తమ పిల్లలపై తల్లిదండ్రులకు ఉండే ఆశ. ఆ ఆశలను నీరుగార్చేలా పిల్లలు 'గంజాయి మత్తు'లో చిత్తవుతున్నారు. రోజురోజుకీ గుంటూరులో గంజాయి ఘాటు గుప్పుమంటూనే ఉంది. ఉత్తరాంధ్ర నుంచి రవాణా నిత్యకృత్యమైంది. ఇందులో అధికంగా యువత, విద్యార్థులే భాగస్వాములుగా ఉండటం కలవరపెడుతోంది. గంజాయి, డ్రగ్స్ కేంద్రంగా గుంటూరు నిత్యం హాట్ టాపిక్‌గా మారుతూనే ఉంది. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వారు పెడదోవ పడుతున్నారు. ఈ పరిస్థితులు తల్లిదండ్రులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. యువత, విద్యార్థులను టార్గెట్ చేసుకుని గుంటూరులో గంజాయి దందా నడుస్తోంది.



విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పట్టాభిపురం పోలీసులు (ఫైల్)

పట్నంబజారు: నగరంలో తరచూ గంజాయి కేసులు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఒక్కో కేసులో పదుల సంఖ్యలో నిందితులకు ఈ వ్యవహారంలో పాత్ర ఉన్నట్లు తేలుతోంది. కొద్ది రోజుల క్రితం పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని హరిహర మహల్ సెంటర్ సమీపంలో ఉన్న ఒక హాస్టల్‌లో అనిల్ అనే విద్యార్థి వద్ద ముందుగా పోలీసులు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తీగ లాగితే డొంక కదిలినట్లు డీఎంఎల్‌టీ చదువుకునే అల్తాఫ్, మున్నా అనే విద్యార్థులే గంజాయిని నిత్యం తీసుకొచ్చి హాస్టల్‌లో పొట్లాలుగా చేసి బయట విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచారు. గంజాయి సేవిస్తున్న 18 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 41 ఏ నోటీసులు ఇచ్చి పంపారు. ఈ కేసులోని వారందరూ విద్యార్థులే కావటం గమనార్హం. నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో ఒక మహిళ, ముగ్గురు పురుషులు కలిసి గంజాయి విక్రయిస్తున్న నేపథ్యంలో స్వర్ణభారతినగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో 10 మందిని అదుపులోకి తీసుకుని, 41ఏ నోటీసులు ఇచ్చి పంపారు. ఈ కేసులో మహిళ సహా అందరి వయస్సు 25 ఏళ్లలోపే కావటం గమనార్హం. లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో కొద్ది రోజుల క్రితం ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరిలో ఇద్దరు యువకులపై ద్విచక్ర వాహన చోరీ, గతంలో గంజాయి విక్రయించిన కేసులు కూడా ఉన్నాయి.



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

అరకొర కేసులతోనే సరి...

ఇలాంటి ఘటనలు పలుమార్లు పునరావృతం అవుతున్నా అరికట్టడంలో పోలీసులు వైఫల్యం చెందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఒడిశా, విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి కొందరు గంజాయి తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం గంజాయి తాగే యువకులు, విద్యార్థులే ఏకంగా విక్రయాలు కూడా చేస్తుండటం ఆందోళన కలిగించే అంశం. గుంటూరులో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పోలీసులు భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్న ఘటనలు కేవలం వేళ్ల మీద లెక్కపెట్టేలా ఉన్నాయి. విక్రయాలు మాత్రం భారీగా సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బృందాలుగా బైకులపై వెళ్లి మరీ...

నగరంలోని అనేక ప్రాంతాలతోపాటు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, యువకులు బృందాలుగా ఏర్పడి బైక్‌లపై వెళ్లి పాడేరు, విశాఖపట్నం ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి సరఫరా చేస్తున్న సంఘటనలు సర్వసాధారణంగా మారాయి. చిన్న పొట్లాలు చేసి విక్రయిసున్నారు. పోలీసులు దీనిపై దృష్టి సారించటం లేదనే చెప్పాలి. గంజాయి విక్రయాలకు సంబంధించి ఆయా స్టేషన్ మఫ్టీ పార్టీలు, క్రైం సిబ్బందికి తెలిసినప్పటికీ మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. కేజీ గంజాయిని రూ.3 వేల నుంచి రూ. 4 వేల వరకు వెచ్చించి కొంటున్నారు. దానికి ఇక్కడికి తీసుకొచ్చి రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు విక్రయిస్తున్నారు. దీంతోపాటు తెచ్చినవారూ వినియోగిస్తున్నారు.

ఈ ప్రాంతాలే ప్రధాన అడ్డాలు

గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో ఎలాంటి అడ్డూఅదుపు లేకుండా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. చుట్టుగుంట, కృష్ణబాబు కాలనీ, నల్లపాడు కాలేజీ సెంటర్, మిర్చి యార్డు, ఏటుకూరు రోడ్డు, శారదాకాలనీ, ఆర్టీసీ కాలనీ, రూరల్ పరిధిలోని దాసరిపాలెం, చౌడవరం, గుజ్జనగుండ్ల, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో పొట్లాల రూపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం.

సిగరెట్ల రూపంలో సరఫరా

గతంలో కేవలం గంజాయి విక్రయించేవారు. ప్రస్తుతం గంజాయి సిగరెట్లు తయారు చేసి నగరంతోపాటు రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. రోలిన్, ఓసీబీ అనే పేపర్లు కొంతమంది విద్యార్థులు ప్రాజెక్టు వర్క్‌ల కోసం వినియోగిస్తారు. స్పష్టంగా అవి విక్రయించకూడదని తెలిసినా కొంత మంది పుస్తకాల షాపుల యజమానులు పట్టించుకోవడం లేదు. వీటితో తయారు చేసిన సిగరెట్లను ప్రాంతాన్నిబట్టి రూ.100 - రూ.500 వరకు విక్రయిస్తున్నారు. సిగరెట్‌లలో సైతం రోల్డ్ పాయింట్స్, జంబో పాయింట్స్ పేర్లు పెట్టి విక్రయిస్తున్నారని సమాచారం. ఇటీవల నగరంలో వీడ్ ఆయిల్ విచ్చలవిడిగా దొరుకుతోందని తెలుస్తోంది. పది ఎంఎల్ పరిమాణం కలిగిన డబ్బా రూ. 3 వేలకు పైగా ఉంటుంది. దీనిని సిగరెట్‌కు రాసుకుని తాగుతూ మత్తుకు బానిసలుగా పలువురు మారుతున్నారు.



గుంటూరులో విక్రయిస్తున్న గంజాయి సిగరెట్లు

విక్రేతలపై ప్రత్యేక దృష్టి



గంజాయి విక్రేతల కట్టడికి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విక్రయాలు చేసే వారిపై ఉక్కుపాదం మోపుతాం. ఇప్పటికే విక్రయించే వారితోపాటు సేవించే వారిపైనా కేసులు నమోదు చేస్తున్నాం. విద్యార్థులు, యువతకు మత్తుతో అనర్థాలపై అవగాహన కల్పించే దిశగా ముందుకు సాగుతున్నాం. గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది.. ఇక్కడి వారికి అందిస్తున్న వారి ఆరా కోసం విచారణ చేస్తున్నాం. కచ్చితంగా గంజాయి విక్రయించే వారిని వదిలిపెట్టం. విద్యార్థులు, యువకుల బంగారు జీవితాన్ని నాశనం చేసే మత్తుకు ఎవరూ అలవాటు పడొద్దు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

మన చేతుల్లోనే మన ఆరోగ్యం



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆదివారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. స్టాల్ బాలికల స్కూల్, హిందూ కాలేజీ కూడలి మీదుగా ఉమెన్స్ కాలేజీ వరకు ర్యాలీ కొనసాగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజీలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... ఈ ఏడాది 'హక్కుల మార్గాన్ని అనుసరించండి – నా ఆరోగ్యం నా హక్కు' అనే నినాదంతో ఎయిడ్స్ దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత వ్యాధిపై అవగాహన కలిగి ఉండి హెచ్ఐవీ లేని సమాజాన్ని నిర్మించాలని కోరారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ... హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపకూడదన్నారు. మందులు వాడడం వల్ల వారు తమ జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని వెల్లడించారు. తర్వాత గోడ పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మనాయక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. పాజిటివ్ వస్తే సకాలంలో చికిత్స తీసుకుంటే జీవిత కాలాన్ని పెంచుకుని ఆరోగ్యంగా బతకొచ్చని తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఇస్మాయిల్, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్. జ్యోత్స్న కుమారి, ఎస్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జె.వి.సుధీర్, జిల్లా జైలర్ ప్రేమ సాగర్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ లత, డాక్టర్ ధాత్రి కుమారి, డాక్టర్ సుబ్బరత్నం, టీజేపీఎస్ కాలేజీ, ఏసీ కాలేజీ, సిమ్స్, చలపతి కాలేజీ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు షేర్ ఇండియా, వీహెచ్ఎస్, కొత్తపేట మహిళా మండలి, సిరి మహిళా సాధికారత వెల్ఫేర్ సొసైటీ, లింక్ వర్కర్స్ స్కీమ్, వైఆర్‌జీ కేర్, మారుతి మహిళా సొసైటీ, షిప్, హోపెన్ సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి

ఎస్పీ సతీష్‌కుమార్

పట్నంబజారు: నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలలో ఎస్పీ పర్యటించారు. మూడు వంతెనల వద్ద మరమ్మతులు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్‌కు తీసుకున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ గేట్ల వైపునకు ట్రాఫిక్ డైవర్షన్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. మూడు వంతెనల వద్ద మరమ్మతులను పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రైల్వే కాంట్రాక్టర్‌కు సూచించారు. నూతన సంవత్సరంలో నగరంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సాంకేతిక బృందంతో మాట్లాడి పూర్తిస్థాయిలో దృష్టి సారించామని తెలిపారు. లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో నిత్యం రద్దీగా ఉండే పూల కొట్ల బజారులో పర్యటించారు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ట్రావెల్ బంగ్లా, ఎంటీవీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నూతన సిగ్నల్స్ పనితీరు పరిశీలించారు. ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య, ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అజీజ్, వెస్ట్ డీఎస్పీ జయరామ్‌ప్రసాద్, ట్రాఫిక్ సీఐలు అశోక్‌కుమార్, సింగయ్య, కొత్తపేట సీఐ వీరయ్య, అరండల్‌పేట సీఐ వీరాస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పట్నంబజారు సెంటర్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

ఏఎన్‌యూలో కొనసాగిన కమిటీ విచారణ

- విద్యార్థినులు, సిబ్బంది, అధికారులతో వేర్వేరుగా సమావేశాలు
- సమస్యలపై కమిటీ ముందు గళం విప్పిన విద్యార్థినులు
- కలుషిత ఆహారం, నీరుతోపాటు పరిసరాల అపరిశుభ్రతపై ఫిర్యాదు



సమావేశం అనంతరం బయటకు వస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా వసతి గృహంలో భోజనంలో పురుగులు, జెర్రి, కప్ప వంటివి వచ్చాయని విద్యార్థినులు చేపట్టిన నిరసనపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ ఆదివారం కూడా యూనివర్సిటీలో పర్యటించింది. విద్యార్థినులు, సిబ్బంది, అధికారులతో వేర్వేరుగా కమిటీ సమావేశమైంది. విచారణ కమిటీ సభ్యులైన తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి పద్మజ, ఫుడ్ సేఫ్టీ అధికారి రవీందర్ రెడ్డిలు విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ ఇబ్బందులపై గళం విప్పారు. తమకు పెట్టే భోజనంలో గాజు పురుగులు, జెర్రి, కప్పలాంటివి వస్తున్నాయని వాపోయారు. తాగునీటితోపాటు వినియోగించే నీరు కలుషితంగా ఉందని వెల్లడించారు. వాటర్ ట్యాంకుల నీటిలో తల వెంట్రుకలు ఉండడంతోపాటు వంట తయారు చేసే పరిసరాలు నాచుతో అపరిశుభ్రంగా ఉంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలను పలుమార్లు చీఫ్ వార్డెన్‌కు చెప్పామని తెలిపారు. ఆమె వాటిని పరిష్కరించకపోగా, తమపై బెదిరింపులకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో ఆహారం తినలేక కొందరు ఇళ్లకు వెళ్లిపోయారని తెలిపారు. చీఫ్ వార్డెన్, ఇతర వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కమిటీని కోరారని సమాచారం. అనంతరం కమిటీ సభ్యులు అక్కడి సిబ్బందితో సమావేశం అయ్యారు. అనంతరం వసతి గృహాలు, యూనివర్సిటీ అధికారులతో కూడా వేర్వేరుగా భేటీలు నిర్వహించారు. చివరికిగా మరోమారు విద్యార్థినులతో సమావేశం అయ్యారు. అన్ని అంశాలతో కమిటీ సోమవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

సత్తా చాటిన వెయిట్ లిఫ్టర్లు



తొలి స్థానాల్లో నిలిచిన లోగేశ్వరన్, రజత్ రాయ్



మూడో స్థానం పొందిన ప్రేమ్ సాగర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్, వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రెండో రోజైన ఆదివారం పలు కేటగిరీల్లో వెయిట్ లిఫ్టర్లు విశేష ప్రతిభ కనబరిచారు. రెండో రోజు ఫలితాలను పోటీల నిర్వాహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ వెల్లడించారు.

విజేతలు వీరే...

- 67 కేజీల విభాగంలో విజేతలుగా మదురై కామరాజు వర్సిటీ లిఫ్టర్ షెన్ బాగారాజ్, మనోన్మనియం సుందరనార్ వర్సిటీ లిఫ్టర్ ఎం.గోపి సుదర్శన్, ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లిఫ్టర్ కె.గురుకన్నన్ నిలిచారు.
- 73 కేజీల విభాగంలో తిరువళ్లువర్ యూనివర్సిటీ లిఫ్టర్ లోగేశ్వరన్, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ లిఫ్టర్ ఎన్వీ. మహేష్, తిరువళ్లువర్ యూనివర్సిటీ లిఫ్టర్ ఎ. మనోబాల పతకాలు కైవసం చేసుకున్నారు.
- 81 కేజీల కేటగిరిలో మంగళూరు యూనివర్సిటీ లిఫ్టర్ బి. రజత్ రాయ్, మనోన్మనియం సుందరనార్ యూనివర్సిటీ క్రీడాకారుడు ఎన్ఎస్. అభిషేక్, యోగి వేమన యూనివర్సిటీ క్రీడాకారుడు దేవరకొండ ప్రేమ్ సాగర్ తొలి మూడు బహుమతులు పొందారు.

శివయ్య సన్నిధిలో 'కార్తిక' సందడి



రాహుకేతు పూజల్లో పాల్గొన్న భక్తులు

- దీప కాంతులతో కళకళలాడిన పెదకాకాని మల్లేశ్వర ఆలయం
- ముగిసిన కార్తిక మాస పూజలు
- రాహుకేతు పూజలకు భారీగా భక్తులు

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కళకళలాడింది. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేసేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలోని యజ్ఞాల బావి స్నానాలు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో అధికంగా తలనీలాలు, వాహన పూజలు, అన్నప్రాసనలు, అంత్రాలయ దర్శనాలు, అభిషేకాలు, రాహుకేతు పూజలు, నవగ్రహ పూజలు జరిగాయి. రాహుకేతు పూజలకు 1,261 టిక్కెట్లు విక్రయించారు. మండపం వద్ద ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని టెంట్లు, క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. తెల్లవారు నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. ఈ టిక్కెట్ల విక్రయం ద్వారానే రూ.6.50 లక్షల ఆదాయం సమకూరింది. ఒక్కరోజులో స్వామివారి ఆదాయం రూ.10 లక్షలు సమకూరినట్లు డిప్యూటీ కమిషనర్ కె.బి. శ్రీనివాస్ తెలిపారు. పెదకాకాని పోలీసులు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా బందోబస్తు నిర్వహించారు. అగ్నిమాపక శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, వైద్య విభాగం సహకారం అందించినట్లు డీసీ తెలిపారు.



కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు



బారులుదీరిన భక్తులు

క్లుప్తంగా

వక్ఫ్ చట్ట సవరణ నిలిపివేతకు డిమాండ్



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వక్ఫ్ చట్ట సవరణను నిలుపుదల చేయాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సెక్రటరీ ఉమ్రైన్ మెహఫూజ్ రెహమాని డిమాండ్ చేశారు. పొన్నూరు రోడ్డులోని మజ్లీస్ ఉలేమా ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రం తక్షణమే 1991 వక్ఫ్ చట్టం కొనసాగించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై తమ అభ్యంతరాలు తెలిపారు. కేంద్రం తీసుకువచ్చిన ఈ ప్రతిపాదన వల్ల వక్ఫ్ బోర్డు నిర్వీర్యం అవుతుందన్నారు. ఈ చర్య ముస్లిం వర్గ హక్కులు, మనోభావాలు దెబ్బతీసేలా ఉందన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అత్యంత ప్రమాదకరమైనదని, దీనివల్ల ముస్లింల భూములు అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా మజ్లీసుల్ ఉలమా అధ్యక్షులు ముఫ్తి బాసిత్, ముఫ్తి ముజాహిద్, ముఫ్తి అబ్దుల్ ఖవి రషాది, మౌలానా ఇస్మాయిల్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

కొల్లిపరలో అత్యధికంగా 9.2 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 9.2 మిల్లీ మీటర్లు వర్షపాతం పడింది. అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 1.6 మి.మీ.కురిసింది. సగటు 4.6 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. మేడికొండూరు 8.2, దుగ్గిరాల 6.8, ఫిరంగిపురం 6.8, పెదకాకాని 6.2, గుంటూరు తూర్పు 5.6, గుంటూరు పశ్చిమ 5.2, తుళ్ళూరు 4.4, మంగళగిరి 4.2, తాడేపల్లి 4.2, చేబ్రోలు 3.6, తాడికొండ 3.4, ప్రత్తిపాడు 3.2, పొన్నూరు 2.8, తెనాలి 2.8, పెదనందిపాడు 2.4, కాకుమాను మండలంలో 2 మి.మీ. చొప్పున పడింది.

ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి

- అసాంఘిక శక్తులను గుర్తించాలి
- పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయండి
- సిబ్బందికి జిల్లా ఏఎస్పీ రవికుమార్ సూచన
- నులకపేట, ప్రకాష్‌నగర్‌లలో కార్డన్ సెర్చ్

తాడేపల్లి రూరల్: కార్డన్ సెర్చ్ నిర్వహించే ప్రాంతంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించాలని గుంటూరు జిల్లా ఏఎస్పీ రవికుమార్ అన్నారు. అసాంఘిక శక్తులు ఎవరైనా ఉంటున్నారా? లేదా? అనేది గమనించాలని సూచించారు. తగిన పత్రాలు లేని వాహనాలను తప్పనిసరిగా సీజ్ చేయాలని పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నులకపేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ముందుగా తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గుంటూరు సబ్ డివిజన్‌లోని ఐదుగురు సీఐలు, మరో వందమంది సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక శక్తులు గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించేవారు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పత్రాలు లేని వాహనాలతో సంచరిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని కార్డన్ సెర్చ్ నిర్వహించే సమయంలో సిబ్బంది గుర్తించాలన్నారు. వాహనాలకు సరైన పత్రాలు లేకుంటే తప్పనిసరిగా ఆ వాహనాలను సీజ్



కార్డన్ సెర్చ్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ రవికుమార్



ప్రకాష్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజ్

చేయాలని, ఇంటి యజమానులతోపాటు అద్దెకు ఉంటున్న వారి గుర్తింపు కార్డులను పరిశీలించాలని పేర్కొన్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి నివాసముంటున్న వారిని గుర్తించాలని ఆయన అన్నారు. మొత్తం 6 టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రకాష్ నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐలు కళ్యాణ్ రాజు, నజీర్ బేగ్, మంగళగిరి పట్టణ రూరల్ సీఐలు వినోద్ కుమార్, వెంకటరావు, పెదకాకాని సీఐ నారాయణ స్వామి, నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీల 'చలో ఢిల్లీ' జయప్రదం చేయాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

తెనాలి: కేంద్రప్రభుత్వం వచ్చే జనవరి నుంచి చేపట్టనున్న జనగణనతోపాటు సమగ్ర కులగణన జరపాలనే డిమాండ్‌తో ఈ నెల 5, 6వ తేదీల్లో జాతీయ స్థాయిలో ఓబీసీలు నిర్వహిస్తున్న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. 5న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా, 6న అఖిలపక్ష సమావేశానికి రాష్ట్రంలోని బీసీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. స్థానిక బృందావన హోటల్ సమావేశ మందిరంలో బీసీ నాయకులతో కలిసి ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా ఓబీసీలు పెత్తందారీవర్గాల అణచివేతకి గురవుతున్నట్టు చెప్పారు. ఓబీసీల సమగ్ర అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. కులగణనకు దేశంలోని అన్ని పార్టీలు సుముఖంగా ఉన్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ నాయకులు సమగ్ర కులగణన చేపడితే జాతీయ సమగ్రత



మాట్లాడుతున్న కేసన శంకరరావు

దెబ్బతింటుందని చెప్పటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని, జనాభా దామాషా ప్రకారం ఓబీసీల రిజర్వేషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను, ఓలేటి శివాజీ, వేముల కృష్ణ, కొల్లూరు హనుమంతరావు, పి.లక్ష్మీనారాయణ, ఎం.పూర్ణచంద్రరావు, కాశిదాసు, ధనుష్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని చిన్నారి మృతి

బల్లికురవ: ముక్కుపచ్చలారని చిన్నారికి అప్పుడే నూరేళ్లు నిండాయి. అనారోగ్యంతో బాధపడుతుంటే చికిత్స కోసం వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలో మృత్యువు లారీ రూపంలో వెతుక్కుంటూ వచ్చింది. ఈ విషాద ఘటన మండలంలోని వేమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన షేక్ మునీర్ బాషా, భార్య, కుమార్తె షేక్ ఖాన్సా (1)తో కలిసి చిలకలూరిపేట వైద్యశాలకు వెళ్లి బైకుపై గ్రామానికి తిరిగి వస్తున్నారు. చెన్నుపల్లి-అనంతవరం ఆర్అండ్‌బీ రోడ్డులోని వేమవరం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని డౌన్ చప్టా వద్దకు రాగానే ఎదురుగా లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌మీద నుంచి చిన్నారి ఖాన్సా కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన స్థలాన్ని ఎస్సై జీవీ చౌదరి పరిశీలించారు. చిన్నారి మృతితో కుటుంబంలో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీవీ కృష్ణారావు ఆశయ సాధనకు కృషి

లక్ష్మీపురం: కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి, ముఠా కార్మిక సంఘం అభ్యున్నతి కోసం అంతిమ శ్వాస వరకు పాటుపడిన ఆదర్శ కమ్యూనిస్టు జీవీ కృష్ణారావు అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. సంగడిగుంటంలోని రేగుల రాఘవయ్య భవన్‌లో ఆదివారం నగర ముఠా కార్మిక సంఘం, సీపీఐ నగర సమితి, ఏఐటీయూసీ నగర సమితి, జీవీ కృష్ణారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీ కృష్ణారావు 8వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. జీవీకే చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. జీవీ కృష్ణారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక కార్మిక సంఘాలను నిర్మాణం చేయడమే కాకుండా ఉద్యమాలు నడపడంలో కార్మిక వర్గాన్ని ఐకమత్యంతో ముందుకు తీసుకెళ్లారన్నారు. ఆ సంఘాలు నేటికీ కొనసాగుతున్నాయని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జీవీ కృష్ణారావు, వారి కుటుంబం కమ్యూనిస్టు భావాలతో పాటు నాస్తికత్వాన్ని, మూఢాచారాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాలుపంచుకున్నట్లు గుర్తుచేశారు. జీవీ కృష్ణారావు తండ్రి పోలయ్య కూడా ఈ బాటలో విశేష కృషి చేశారన్నారు. దేశంలో బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. జీవీ కృష్ణారావు హేతువాద భావాలు, నాస్తిక సిద్ధాంతాలు సమాజంలో ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఠా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. కార్మిక సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు జీవీ కృష్ణారావు అని కొనియాడారు. అనంతరం జీవీ కృష్ణారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీకే విశిష్ట పురస్కారాన్ని మున్సిపల్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావుకు ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాకారులు అభ్యుదయ గేయాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర అధ్యక్షుడు కోటా మాల్యాద్రి, జీవీకే మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ అమ్మిశెట్టి శివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఏఐటీయూసీ నగర గౌరవాధ్యక్షులు జి.సురేష్ బాబు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, కార్పొరేటర్ సంకూరు శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు పులి సాంబశివరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారావుకు పురస్కారం అందిస్తున్న రవీంద్రనాథ్, అజయ్‌కుమార్

బైరాగి సాహిత్యంతోనే ఈ స్థాయికి చేరా

డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

తెనాలి: ఒక వ్యక్తి సాహిత్యంతో ఎవరైనా పూర్తిగా మారిపోవటం అరుదని, అది తన జీవితంలో జరిగిందని రాజ్యసభ మాజీ సభ్యుడు, హిందీ అకాడమీ విశ్రాంత చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. తాను ఈ స్థాయికి రావటానికి కారణం మహాకవి ఆలూరి బైరాగి సాహిత్యమేనని తెలిపారు. తెనాలికి చెందిన ప్రసిద్ధ కవి ఆలూరి బైరాగి శత జయంతి ప్రారంభ సభను ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సభకు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. అరసం కవితా స్రవంతిలో భాగంగా తీసుకొచ్చిన 'ఆలూరి బైరాగి కవిత' పుస్తకాన్ని డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. కాలేజీలో విద్యార్థి నాయకుడిగా ఉద్యమించే రోజుల్లో తన గురువు ఆదేశ్వరరావు ద్వారా బైరాగి కవిత పరిచయమైందన్నారు. పీజీలో బైరాగి సాహిత్యంపై లఘు సిద్ధాంత వ్యాసం రాశానని చెప్పారు. అధ్యాపకుడిగా చేస్తున్నపుడు బైరాగి చివరి రోజుల్లో స్వయంగా ఆయనకు చూపించి సంతకం తీసుకున్నట్టు గుర్తు చేసుకున్నారు. బైరాగి కవిత్వం కాలం గడిచేకొద్దీ మరింతగా సౌరభాలు వెదజల్లుతుందని తెలిపారు. ఆయన సాహిత్యం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని ఆకాంక్షించారు. తిక్కన పదకోశంలాగే బైరాగి పదకోశం చాలా అవసరమని చెప్పారు. తెనాలిలో ప్రతిష్ఠించేందుకు బైరాగి విగ్రహాన్ని సమకూరుస్తామని హామీనిచ్చారు. సభాధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం కలిగిన తెనాలికి చెందిన ఆలూరి బైరాగి మరణం తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని చెప్పారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తన ప్రసంగంలో పొరుగు రాష్ట్రాల్లో విస్తృతమవుతున్న గ్రంథాలయోద్యమం, పుస్తక పఠనం పెంపుపై మన రాష్ట్రంలోనూ కృషి జరగాలని అభిప్రాయపడ్డారు. గ్రంథాలయాలకు కొనుగోలు చేసిన పుస్తక రచయితలకు చెల్లించాల్సిన నిధుల విడుదలకు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట సాయం చేయాలన్నారు. కనపర్తి బెన్‌హర్ స్వాగతం పలికిన ఈ సభలో డాక్టర్ లక్ష్మీప్రసాద్‌ను తొలుత ప్రముఖ కవి బండ్ల మాధవరావు పరిచయం చేశారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తొలుత బైరాగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



ఆలూరి బైరాగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం

మహిళలు బట్టతలకు మాత్రలు వాడొచ్చు

డాక్టర్ రుచిత దూరత్

గుంటూరు మెడికల్: బట్టతల నివారణకు ఇప్పటి వరకు అందరూ లోషన్ వాడుతున్నారని, ముఖ్యంగా మహిళల్లో బట్టతల నివారణకు మినాక్సిడిల్ మాత్రలు వాడటం వల్ల ప్రయోజనం ఉంటుందని ప్రముఖ స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రుచిత దూరత్ అన్నారు. గుంటూరు శ్రీ కన్వెన్షల్‌లో నిర్వహిస్తున్న ఐఏడీవీఎల్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ 43వ వార్షిక సదస్సు ఆదివారం ముగిసింది. నిరంతర వైద్య విద్య కార్యక్రమం (సీఎంఈ)లో భాగంగా డాక్టర్ రుచిత దూరత్ మాట్లాడుతూ.. బట్టతల నివారణకు ఈ మాత్రలు పురుషులు, స్త్రీలు వాడొచ్చని చెప్పారు. జుట్టును బాగా లాగి గట్టిగా జడ వేయటం ద్వారా వెంట్రుకలు రాలిపోతాయన్నారు. డెర్మటాలజీలో లేజర్ చికిత్స వలన కలిగే ప్రయోజనాలు, ఏ చర్మ సమస్యలకు వీటిని వినియోగించాలనే అంశాలపై డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. ముఖ సౌందర్యం, కేశాలు పెరిగేందుకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక ఇంజెక్షన్లు, వైద్య పద్ధతుల గురించి పలువురు వక్తలు మాట్లాడారు. పేపర్ ప్రజెంటేషన్ పోటీల్లో గుంటూరు వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ ఆసియా ఫాతిమాకు ప్రథమ బహుమతి లభించింది. డాక్టర్ ధృతికి బెస్ట్ థీసిస్ ఆన్ సింప్లిఫైడ్ విటిలిగో సర్జరీలో అవార్డును అందజేశారు. తొలుత వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్‌టీఆర్ స్టేడియంలో సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ జాతీయ సెక్రటరీ డాక్టర్ భూమేష్ కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. హెచ్ఐవీకి ఏ విధంగా వైద్య సేవలు అందించాలి, హెచ్ఐవీ సెక్సువల్ డిసీజెస్ గురించి వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ సౌజన్య, సదస్సు సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కె.ఎ.సీతారామ్, కో చైర్‌పర్సన్ డాక్టర్ పి.ఎస్.మోహనరావు, యూనియన్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ నాగేశ్వరరావు, డీఎస్ఎస్ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.



అవార్డు అందజేస్తున్న డాక్టర్ కవిత, డాక్టర్ సౌజన్య, పక్కన డాక్టర్ సీతారామ్ తదితరులు

నూతన అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసులు...

ఐఏడీవీఎల్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన డాక్టర్ శ్రీనివాసులు, రాష్ట్ర కోశాధికారిగా తిరుపతికి చెందిన డాక్టర్ సజ్జా ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సదస్సు ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమర్థ నిర్వహణకుగాను అధ్యక్ష, కార్యదర్శులు కవిత, సౌజన్యకు పలువురు అభినందనలు తెలిపారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల నిరసన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఆదివారం పోరాట శిబిరం నుంచి ప్రకాష్ నగర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ.. శనివారం అక్రమంగా కార్మికుల గుడిసెలను కూల్చివేశారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్మికుల న్యాయమైన పోరాటానికి అధికారులు మద్దతు ఇవ్వాలని కోరారు. కోర్టు తీర్పుల ప్రకారం కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకుండా జాప్యం చేయడం తగదన్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా గుడిసెలను కూల్చివేయడం సరికాదని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ, రూరల్ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొట్టే కరుణాకర్ రావు, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బి.ప్రకాష్, ఆశీర్వాదం, బి. వెంకయ్య, సాంబశివరావు, యెహోషువా, బాషా, రమాదేవి, ఎం.శారద, సారమ్మ, సామ్రాజ్యం, హిమాంబి, దుర్గమ్మ, నాని, నాగేశ్వరరావు, సుబ్బారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

అపూర్వ కలయిక.. జ్ఞాపకాల వేదిక



గ్రూప్ ఫొటో దిగిన నాటి విద్యార్థులు

తెనాలి: రూరల్ మండల గ్రామం సంగం జాగర్లమూడిలోని శ్రీకొత్త వెంకయ్య చౌదరి మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూలులో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1979–80వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 44 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన కొత్తలో 1952లో ప్రారంభమైన ఈ హైస్కూలు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత కొత్త రాజబాబయ్య ఆధ్వర్యంలో ఉజ్వలంగా వెలిగింది. ఇన్విజిలేటర్లు లేకుండా పరీక్షల నిర్వహణ అప్పట్లో ఈ పాఠశాల ప్రత్యేకత! విశాలమైన క్రీడామైదానం సహా సకల వసతులు కలిగిన ఈ పాఠశాలలో తాము విద్యనభ్యసించటం గర్వకారణమని పలువురు చెప్పారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణవికి బెస్ట్ ఇంటీరియర్ డిజైనర్ అవార్డు

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన కాళంగి ప్రణవికి గ్లోబల్ చాంబర్ ఆఫ్ కన్స్యూమర్ రైట్స్, కిటిక్రాఫ్ట్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ సంయుక్తంగా అందజేసే ఇంటర్నేషనల్ ఎమినెన్స్ అవార్డులలో 2024 సంవత్సరానికిగాను బెస్ట్ కమర్షియల్ ఇంటీరియర్ డిజైనర్ అవార్డు లభించింది. ఈ అవార్డును ప్రణవి పంజాబ్ గురుగావ్‌లో ఏర్పాటు చేసిన 21వ ఎడిషన్ సమావేశంలో శనివారం రాత్రి అందుకున్నారు. ప్రణవి వ్యాపార రంగంలో ఇంటీరియర్ డిజైన్ ఆవశ్యకతను, అభివృద్ధిని విద్యార్థులకు నూతన పద్ధతులలో బోధించారు. బోధన, అభ్యాసం, అభ్యాస వాతావరణాన్ని పునర్నిర్మించడంలో ప్రణవి జరిపిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందించినట్లు న్యాయ నిర్ణేతలు ప్రకటించారు. ప్రణవి హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ)లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ట్ పట్టాను పుచ్చుకున్నారు. తర్వాత హైదరాబాద్‌లో మిత్రులతో కలిసి స్టూడియోను ప్రారంభించారు. ఇంటీరియర్ డిజైన్ విభాగంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ అవార్డు తనకు రావడం అదృష్టమని, తనకు భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ ఉత్సాహంతో పనిచెయ్యడానికి ఇది ఉపకరిస్తుందని అన్నారు. ఈ అవార్డు రావడంపై ప్రణవి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న కాళంగి ప్రణవి

స్వర్ణ సమ్మేళనం.. ఆత్మీయతే ఆద్యంతం

తెనాలి: అయిదు దశాబ్దాల క్రితం అంతా ఒకచోట చదువుకున్న విద్యార్థులు వారు... విద్యాభ్యాసం తర్వాత వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారెందరో ఉన్నారు. సుదీర్ఘకాలం తర్వాత 'స్వర్ణోత్సవ' ఆత్మీయ సమ్మేళనం పేరుతో సంబరం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల్నుంచి, విదేశాల్నుంచి కూడా ఆనాటి విద్యార్థులు పాల్గొనటం విశేషం. స్థానిక వీఎస్సార్ కాలేజీలో 1972–74లో ఇంటర్మీడియట్, 1974–77లో బీఎస్సీ (సీబీజెడ్) చేసిన పూర్వవిద్యార్థుల స్వర్ణోత్సవ సంబరాలు ఆదివారం స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఘనంగా జరుపుకొన్నారు. విశ్రాంత అధ్యాపకులు శైలజ, ఎస్.రామమోహనరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన వేడుకల్లో ఆనాటి ప్రిన్సిపల్స్ ఎస్.ముకుందరావు, ఎం.శాంతాదేవి, ఎన్ఎస్‌వీ రమణ, ఎ.రాజేశ్వరి, అధ్యాపకులు కె.వెంకట్రావు, మల్లికార్జునరావు, కె.బాపారావు, పీబీఎస్ లక్ష్మి, కె.సాంబశివరావు, సుగుణ, రాజ్యలక్ష్మిని నాటి విద్యార్థులు సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నెల్లూరు ప్రజావైద్యశాల డాక్టర్ పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవకు అంకితం కావడమే జీవితానికి పరమార్థమని సూచించారు. తాము స్థిరపడటానికి గురువుల మార్గదర్శకమే కారణమని మరో అతిథి డాక్టర్ ఎస్.రామకృష్ణ అన్నారు. వివిధ బ్యాంకుల విశ్రాంత ఉన్నతాధికారులు కె.ఆంజనేయులు, బసవయ్య, రామమోహనరావు, గోవర్ధన్, ప్రొఫెసర్లు ఎస్.శివరామకృష్ణప్రసాద్, గుజరాత్ ఆనంద్, జె.శివసత్యమోహన్, ఇంజినీర్లు దేవేంద్ర, మహేష్, సుధాకర్, న్యాయవాదులు బాలగోపాల్, పారిశ్రామికవేత్తలు జీఎల్‌కే ప్రసాద్, రామకృష్ణ, విశ్రాంత అధ్యాపకులు శివకుమార్, సత్యనారాయణ, వివేక విద్యా సంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాలేజీ ప్రతినిధిగా ఎన్.సుగుణ పాల్గొన్నారు. కళాశాలను సందర్శించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు.



సమావేశంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు